ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







సంగమేశ్వరం ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సంగమేశ్వరం ప్రాజెక్టుకు
బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- నాలుగు మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలి
- ప్రాజెక్టు వైపు చూడని ప్రజాప్రతినిధులు
- సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-పొన్నలూరు

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా సంగమేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించి నాలుగు మండలాల ప్రజలను, రైతులని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు డిమాండ్ చేశారు. పొన్నలూరు మండలంలోని చెన్నుపాడు పంచాయతీలో ఉన్న సంగమేశ్వరం ప్రాజెక్టును సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ 2009లో సంగమేశ్వరం ప్రాజెక్టును రూ.50 కోట్లా 50 లక్షల అంచనాతో ప్రారంభించగా.. ప్రస్తుతం అంచనా వ్యయం రూ.200 కోట్లకు పైగా పెరిగింది. పనులు ప్రాజెక్టు కరకట్ల వరకే పరిమితమయ్యాయి. పర్చూరువారిపాలెం దగ్గర ఉన్న రాకపోకలకు బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. గేట్లు ▶ 2లో

ఎమ్మెల్సీ ఎన్నికలకు
నేడే పోలింగ్

- పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారులకు బెదిరింపులు
- లక్ష్మణరావు పట్ల సానుకూలంగా ఉన్న ఓటర్లు.!

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుని ఎన్నికల కోసం గురువారం పోలింగ్ జరగనుంది. బాపట్ల జిల్లా పరిధిలో 12 మండలాల్లో ఏర్పాటు చేసిన 34 పోలింగ్ కేంద్రాలలో 24,493 మంది పట్టభద్ర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈమేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికి ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్యే ఉంది.

పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు మండలాల వారీగా పర్యటనలు చేసి అందరినీ కలిశారు. పలు ప్రజాసంఘాల, ఉపాధ్యాయ సంఘాల నేతలు 'పెద్దల సభకు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావునే గెలిపించుకుందాం' అన్న నినాదంతో ఆయన గెలుపు కోసం ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ఏకపక్షం అని భావించిన అధికారపార్టీ నేతలకు నియోజకవర్గాల్లో అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు లభిస్తున్న ఆదరణ చూసి ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. జిల్లా పరిధిలోని వేమూరు నియోజకవర్గం చుండూరు, అమృతలూరు, వేమూరు, రేపల్లే నియోజకవర్గంలోని నిజాంపట్నం, చెరుకుపల్లి, బాపట్ల నియోజకవర్గంలోని పిట్లవానిపాలెం మండలాల్లో పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారులను బెదిరించారు. పోలింగ్ కేంద్రాలో ఏజెంట్లు లేకుండా చేసేందుకు తమకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. ఓటర్లలో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు సానుకూలత ఉన్న నేపథ్యంలో ఓటుకు రూ.5 వేల వరకు ఇస్తామంటూ ప్రచారం చేశారు. కానీ బుధవారం రాత్రి వరకు ఎవరికీ నగదు చేరకపోవడంతో ఇప్పటి వరకు కూటమి అభ్యర్థి తరపున తిరిగిన వారు డీలా పడ్డారు. జిల్లా పరిధిలో కొన్ని చోట్ల తమ ప్రాబల్యాన్ని ప్రదర్శించుకునేందుకు టిడిపి నేతలు కొందరు హడావుడి చేయడం తప్ప ఓటర్లు అత్యధికులు పీడీఎఫ్ అభ్యర్థి పట్ల సానుకూలంగా ఉన్నారు. కొన్ని చోట్ల జనసేనకు చెందిన వారు ఈ ఎన్నికల్లో తమను టిడిపి నేతలు పట్టించుకోని కారణంగా పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు పలుకుతామని చెప్పడం గమనార్హం.

బుధవారం రాత్రి చుండూరులో ▶ 2లో



బాపట్లలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

'వెలిగొండ'కు
ఈ సారైనా నిధులు సాధిస్తారా.?

- జిల్లాలో ఇప్పుడు ఇదే కీలక ఎజెండా
- బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కోరుతూ వామపక్షాల ఆందోళన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. పైగా బడ్జెట్ కూడా ప్రవేశపెడతారు. ఈ నేపథ్యంలో అందరి దృష్టి ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలపైనే ఉంది. ఎందుకంటే జిల్లాలో అనేక అవసరాలున్నా అన్నింటికన్నా కీలకమైంది వెలిగొండ ప్రాజెక్టు. కోట్లాది రూపాయల నిధులతోనే ఇది ముడిపడి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా సాగుతాయని ఆశపడితే అడుగు కూడా పడలేదు. గత ప్రభుత్వం అంతా పూర్తయిందన్నట్లుగా ఎన్నికల కోసం ప్రారంభమే చేసేసుకుంది. అప్పటి సిఎం జగన్ వెలిగొండను రైతుల్లేకుండా వారిని దగ్గరకు కూడా రానివ్వకుండానే సభ పెట్టి రైతులకు అంకితం చేశారు. ఎన్నికల్లో వెలిగొండపై ప్రతిపక్ష నేతగా చంద్రబాబు స్పష్టంగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే దీన్ని పూర్తిచేస్తామని ప్రకటించారు. నిర్వాసితులకూ మెరుగైన హామీ ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి 8 నెలలయింది. ఇప్పటికీ దీని వ్యవహారం పట్టడం లేదు. నిధుల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేవలం రూ.390 కోట్లు కేటాయించారు. వాస్తవంగా ఈ ఏడాది కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించాలి. అప్పుడే దీన్ని రెండేళ్లలో పూర్తి చేయడం సాధ్యమవుతుంది. ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు రెండేళ్లలో పూర్తి చేస్తామని గడువు పెట్టారు. అందుకు తగ్గట్టుగా పనులు సాగడం లేదు. ఏటా రూ.రెండు వేల కోట్లు చొప్పున నిధులు ఇస్తేనే సాధ్యం. నిర్వాసితులకు ప్యాకేజీల కోసమే రూ.వెయ్యి కోట్ల వరకూ అవసరం ఉంది. మిగతా పనులకూ భారీగానే నిధుల అవసరం ఉంది. ముంపు గ్రామాలు ఖాళీ చేస్తేనే ఏ పనులైనా.ఇక సొరంగాల్లోనూ చాలా పని ఉంది. ఎందుకంటే రెండో సొరంగంలో తవ్విన మట్టిని మొదటి సొరంగంలో పోశారు. దీన్ని బయటకు తేవాలి. ఇదే పెద్ద సవాలుగా మారింది. రెండు సొరంగాల మధ్య ఖాళీని పూడ్చాలి. లోపల ఉన్న మిషన్లను బయటకు తేవాలి. వీటితో పాటు బయట కాలువలు దెబ్బతిని పోయాయి. వాటిని సరిచేయాలి. ఇలా జరగాల్సినవి చాలా ఉన్నాయి. నిధులు ఇస్తే అవన్నీ జరిగిపోతాయి. సిఎం చంద్రబాబు స్థాయిలోనే దృష్టి సారించాలి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమ్మడి పట్టు పట్టాలి. నిధుల కోసం ఐక్యంగా ఒత్తిడి చేయాలి. వామపక్షాలు వెలిగొండకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని దశలవారీగా ఆందోళన చేపట్టాయి. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెలిగొండను సందర్శించారు. నిర్వాసితుల సదస్సులు, ప్రాజెక్టు సాధన కోసం జరిగే ఆందోళనల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వెలిగొండపైనే ప్రధానంగా వామపక్షాలు దృష్టి సారించాయి. పశ్చిమ ప్రాంత పాలకపక్ష ప్రజాప్రతినిధులు కూడా ఈ సమావేశాల్లోనే వెలిగొండకు ఎక్కువ నిధులు వచ్చేలా ▶ 2లో



టంగుటూరు మండలం, జమ్ములపాలెంలో శివలింగాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కిక్కిరిసిన శైవక్షేత్రాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాలకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం చేశారు. ఎస్పీ దామోదర్ త్రిపురాంతకేశ్వర ఆలయంలో కుటుంబంతో కలిసి పూజలు చేశారు.



త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ దామోదర్ కుటుంబం

సంగమేశ్వరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. లాభదాయకమైన కరకట్ల వరకే కాంట్రాక్టర్లు పరిమితమై పూర్తి చేశారన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి అమల్లోకి వచ్చినట్లయితే పది వేల ఎకరాల భూమి సాగు చేసుకోవటానికీ, అంతర్గత జలాలు పెరగడానికీ వివిధ చెరువులు నింపుకోవడానికీ, నాలుగు మండలాల ప్రజలు, రైతులు అభివద్ధి చెందటానికి అవకాశం ఉండేదన్నారు. కానీ ప్రభుత్వాలు వస్తూ ఉన్నాయి.. పోతూ ఉన్నాయని.. సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు అక్కడే ఉన్నాయని చెప్పారు. ప్రజాప్రతినిధులలు సంగమేశ్వరుడిని ప్రతి సంవత్సరం దర్శించుకుంటారు గానీ ప్రాజెక్టు వైపు చూడరని, ఈ బడ్జెట్ సమావేశంలో అవసరమైన నిధులు కేటాయించి సంగమేశ్వర ప్రాజెక్టు పనులు పూర్తి చేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టంగుటూరి రాము, గంటెనపల్లి శ్రీనివాసులు, మోజస్, వెజండ్ల సింగయ్య, మల్లెల కొండయ్య, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, కేజీ మస్తాన్, గడ్డం వందనం, శ్రీనివాసులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

బిఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలు తొలగించడం మనువాదమే

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, విప్లవ వీర కిషోరం షాహిద్ భగత్ సింగ్‌ల చిత్రపటాలను తొలగించి, మోదీ, ద్రౌపదిముర్ముల చిత్రపటాలను ఏర్పాటు చేసిన ఘటనపై వ్యతిరేకిస్తూ శింగరాయకొండలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జై భీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కొండలరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య ముసుగులో పాలనగావిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం తన మనువాద భావజాలాన్ని అమలు పరుస్తోందని జై భీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షులు అంబటి కొండలరావు అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, విప్లవ వీర కిషోరం షాహిద్ భగత్ సింగ్‌ల చిత్రపటాలను తొలగించి, మోదీ, ద్రౌపది ముర్ముల చిత్రపటాలను ఏర్పాటు చేయడం సిగ్గుచేటని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ ప్రపంచ మానవాళికి అందించిన సేవలకు గుర్తింపుగా ప్రపంచ దేశాలన్నీ తమ తమ చట్టసభలలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించుకొని ఆ మహానుభావుని ఆలోచనలతో పయనించేందుకు ప్రయత్నిస్తుంటే దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీలో భారత రాజ్యాంగ నిర్మాత చిత్రపటాన్ని తొలగించడం హీనమైన చర్య అని అన్నారు. అలానే భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఉరితాడును పూలమాలగా స్వీకరించి 23 సంవత్సరాలకే తన నిండు ప్రాణాలను సైతం త్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డడైన భగత్‌సింగ్ చిత్రపటాన్ని కూడా తొలగించడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుల స్థానంలో ఆదాని, అంబానీలకు దేశాన్ని దోచిపెట్టె మీలాంటి వ్యక్తుల ఫొటోలు పెట్టడం భారత ప్రజల దౌర్భాగ్యం అని కొండలరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ పీపుల్స్ జేఏసీ మూలగుంటపాడు అధ్యక్షుడు కొడవలి మణి, జై భీమ్ పీపుల్ జేఏసీ అధ్యక్షుడు షేక్ జిలాన్, జై భీమ్ జేఏసీ శింగరాయకొండ మండల అధ్యక్షుడు చుండూరు సుబ్బారావు, జై భీమ్ పీపుల్ జేఏసీ శింగరాయకొండ మండలం ఉపాధ్యక్షుడు టి అశోక్, శింగరాయకొండ మండల అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు యర్రమాల సుబ్బారావు, నాగరాజు, పి నరసింహ, పి రాధాకృష్ణ, వాసు, కే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం?

రోడ్డును ఆనుకుని విద్యుత్ స్తంభాల ఏర్పాటు • చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మద్దిపాడు

తెల్లబాడు-సంద్రపాడు గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు నూతనంగా ఏర్పాటు చేసిన తీరు అనేక విమర్శలకు తావిస్తోంది. ఇదివరకే పాత విద్యుత లైన్ రోడ్డుకు చాలా దూరంగా ఉండగా కొత్తగా వేసిన లైన్ తారు రోడ్డుకు రెండు అడుగల దూరంలోనే ఏర్పాటు చేయడం ప్రజలకు అసౌకర్యంగా మారుతోంది. ఇలా చేయడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేననే విమర్శలు వినవస్తున్నాయి. నిబంధనల మేరకు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి ఎక్కడా అమలు కాలేదని, భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారంటూ రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని దొడ్డవరం పంచాయతీలో గల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చీమకుర్తి మండలం సంద్రపాడు గ్రామానికి ఘడియాపూడి ఫీడర్ ద్వారా కరెంట్ సరఫరా జరుగుతోంది. సంద్రపాడు గ్రామానికి 24 గంటల పాటు విద్యుత్‌ను అందించేందుకు ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో భాగంగా నూతనంగా విద్యుత్ లైన్ మంజూరైంది. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టరు తెల్లబాడు-సంద్రపాడు గ్రామాల మధ్య నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇంకా వాటికి కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదు. ఆ ఏర్పాటు చేసిన స్తంభాలు కూడా తారు రోడ్డుకు రెండు అడుగుల దూరంలో ఏర్పాటు చేశారు. ఆ రోడ్డులో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఆనుకుని స్తంభాలను ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల్లో సైతం భయాందోళన నెలకొంది. మామూలుగానే రోడ్డుకు ఇరువైపులా కావాల్సినంత స్థలం ఉండగా రోడ్డును అనుకుని స్తంభాలు ఏర్పాటు చేయడం ఏంటనే ప్రశ్న నెలకొంది. ఎదురుగా రెండు పెద్ద పెద్ద వాహనాలు వస్తే ఆ సమయంలో స్తంభాలను ఢీకొనే అవకాశం ఉంది. ఒకవేళ స్తంభాలకు కరెంట్ కనెక్షన్ ఉంటే దాని వలన ప్రాణ నష్టం కూడా జరిగే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంది. కరెంట్ సరఫరాకు స్తంభాలు ఏర్పాటు చేసే ముందు విద్యుత్ శాఖ అధికారులు డిఇ, ఎడి, ఎఇ నుంచి కింద స్థాయి ఉద్యోగి లైన్‌మ్యాన్ వరకు పరిశీలించిన తరువాతనే స్తంభాల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు. ఇదివరకే తెల్లబాడు-సంద్రపాడు గ్రామాలకు వెళ్లే పాత విద్యుత్ లైన్ రోడ్డుకు చాలా దూరంలో ఉన్నప్పటికీ మరి నూతనంగా వేసే స్తంభాలను తారురోడ్డుకు రెండు అడుగుల దూరంలో ఏర్పాటు చేయడం పట్ల అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మద్దిపాడు, చీమకుర్తి రెండు మండలాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సదరు ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించి రోడ్డుకు దూరంగా వేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుకు అనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడే పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

పిడిఎఫ్ అభ్యర్థి తరపున 'ఎవడ్రా ఏజెంట్‌గా కూర్చోనేది.?' అంటూ అధికార పార్టీకి చెందినవారు వీరంగం సృష్టించారు. ఓటమి భయంతో టిడిపి వారు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

'వెలిగొండ'కు ఈ సారైనా నిధులు సాధిస్తారా.?

(మొదటిపేజీ తరువాయి)

చూడాలి. ముందుగానే ఇరిగేషన్ మంత్రితోనూ చర్చించాలి. అయితే ఇప్పటివరకూ ఆ తరహా ప్రయత్నాలైతే ఎవరూ చేయడం లేదు. నియోజకవర్గాల్లో చిన్నచిన్న పనుల కోసం మంత్రుల పేషీల చుట్టూ తిరుగుతున్నారు. సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఉన్నా కూడా నోరు విప్పడం లేదు. ఈ సారి అలా కాకుండా వెలిగొండ కోసం అసెంబ్లీ గళం విప్పాలి. మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం ఎమ్మెల్యేలే ప్రధానంగా స్పందించాలి. నిధుల సాధన కోసం ఎలా స్పందిస్తారో చూద్దాం. ఇక జిల్లా మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి కూడా వెలిగొండకు నిధులు తేవడం ప్రధాన బాధ్యతగా భావించారు. ఎందుకంటే మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాలో ప్రవేశించిన రోజునే ఆయన వెలిగొండపై స్పష్టంగా హామీ ఇచ్చారు. దాన్ని సఫలీకృతం చేయాల్సిన అవసరం ఉంది. అందుకు ఈ బడ్జెట్‌ను కీలకంగా వినియోగించుకోవాల్సిన తరుణం కూడా వచ్చింది.

సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే: మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మరింత పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే ఉద్యోగుల్ని రేషనలైజేషన్ చేస్తున్నామని గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విలేజ్ అండ్ వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సచివాలయం ప్రాతిపదికను కాకుండా క్లస్టర్ వారీగా రేషనలైజేషన్ చేసి అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని మంత్రిని కోరారు. డిజిటల్ అసిస్టెంట్లకు పిఎస్ గ్రేడ్ 5తో పాటు ఇతర డిపార్ట్మెంట్లోకి జూనియర్ అసిస్టెంట్ మరియు సబ్ రిజిస్టర్ ఆఫీసులో సమాన హోదా కలిగిన పదోన్నతి కల్పించాలన్నారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఇన్ సర్వీస్ బి.ఎడ్‌లో అవకాశం కల్పించడం వలన వెల్ఫేర్ డిపార్టుమెంట్‌తో పాటుగా విద్యా శాఖలో కూడా అవకాశం కల్పించాలని, సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌తో కూడిన పదోన్నతి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియపై ఇప్పటికే ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు తీసుకున్నామని, దీనిపై సీనియర్ అధికారులతో కమిటీ వేసి చర్చించి ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా రేషనలైజేషన్ చేస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ విలేజ్ అండ్ వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జివివి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు బి అఖిల్, చంద్రబాబు, చాంద్‌బాషా, రాజశేఖర్, గంగుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మంత్రిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రైతు కంట్లో కారం

దిగజారుతున్న మిర్చి ధరలు • ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒక వైపు ప్రకతి వైపరీత్యాలు, మరోవైపు తెగుళ్ల మధ్య రైతులు మిర్చి సాగు చేపట్టారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. ఎంతో ఆశతో మొదటి విడత కోతలు ప్రారంభించారు. కల్లాల్లో ఆరబోసి విక్రయానికి సిద్ధం చేశారు. మార్కెట్‌లో ధర ఆశాజనకంగా లేకపోవడంతో సతమతమవుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయానికి ధర తక్కువగా ఉండడంతో డీలా పడ్డారు. రైతులు అత్యధికంగా సాగు చేసిన తేజా రకం మిర్చి గత ఏడాది ఇదే నెలలో రూ.17 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.13,500లు వరకు వ్యాపారులు అడుగుతున్నారు. దీంతో రైతులు పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

నియోజకవర్గంలో మిర్చి సాగు ఇలా..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో 10,409 ఎకరాలు, పెద్దదోర్నాల మండలంలో 5817 ఎకరాలు, పెద్దారవీడు మండలంలో 454 ఎకరాలు, త్రిపురాంతకం మండలంలో 5767 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 8098 ఎకరాల్లో ఈ ఏడాది మిర్చి పంటలు సాగు చేశారు.

ముందుకు రావడం లేదు

బయపనేని వెంకట నారాయణ, రైతు, కుందంపల్లి



మూడు ఎకరాల విస్తీర్ణంలో తేజా రకం మిరప పంటను వేశాను. రూ.2.30 లక్షల పెట్టుబడి పెట్టాను. మొదటి కోత కోసి కల్లంలో ఆరబోశాను. విక్రయిద్దామని భావించి గ్రామానికి వచ్చిన వ్యాపారస్థులకు చూపించాను. కాయలను చూసి కొనకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎందుకనో అర్థం కావడం లేదు. అసలు కొంటారో లేదోనని భయంగా ఉంది.



కల్లంలో ఆరబోసిన మిర్చి

ధరలో కోత విధిస్తున్నారు: పారా సుబ్బారావు, రైతు, కందంపల్లి



ఎగుమతులు లేవంటూ ధరలో కోత విధిస్తున్నారు. నేను తీసుకెళ్లిన సరకులో సగం తాలు రేటు వేశారు. కొంతసరకు రూ.11,000 ధర పలికింది. మా అల్లుడు తీసుకొచ్చిన మిర్చికి రూ.11,500 ధర వేశారు. ఇదే రకం మిర్చిని గతేడాది రూ.17,000కు అమ్మాము. కూలి రేట్లు గతేడాది రూ.300 ఉండగా ప్రస్తుతం రెట్టింపు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్
- ఎన్నికల సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి-బాపట్ల

ఉమ్మడి గుంటూరు, కష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ అధికారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ కర్లపాలెం, పిట్టలవానిపాలెం ప్రాంతాలకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సుల్లో పోలింగ్ సామగ్రి, ఎన్నికల అధికారులను పంపినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూలు, రేపల్లెలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు, ఎన్నికల అధికారులు సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేశామన్నారు. ఎన్నికల సామాగ్రిని పరిశీలించుకోవడంతో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధివిధానాలను పోలింగ్ అధికారులకు వివరించమన్నారు. బాపట్ల నియోజకవర్గంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ఐదు, బాపట్ల సైన్స్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పిట్టలవానిపలెం, కర్లపాలెం మండలంలో రెండేసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఆర్‌డిఒ గ్లోరియా, బాపట్ల తహశీల్దారు షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కర్లపాలెం తహశీల్దారు సుందరమ్మ, పిట్టలవానిపాలెం తహశీల్దారు మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాపట్లలో పోలింగ్ బాక్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వేమూరు : కష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తహశీల్దారు సుశీల తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ మండలంలో 1,662 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందు కోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓ పోలింగ్ కేంద్రంలో 820, మరో పోలింగ్ కేంద్రంలో 842 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దారు తెలిపారు.


రేపల్లె మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమాలక్ష్మి

రేపల్లె : కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తెలిపారు. పోలింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్, సిబ్బందిని పంపినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంఇ అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. రేపల్లెలో ఆరు పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని నగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి, వేమూరు మండలాలలో రెండేసి పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. బ్యాలెట్లు, బ్యాలెట్ బాక్స్‌లను సిబ్బందికి అందజేసి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పర్చూరు

మండల పరిధిలోని నూతలపాడు శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి- పర్చూరు

ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చిననందిపాడు వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పర్చూరులో కూలీలను దించి పెదనందిపాడు వెళ్లున్న ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. దీంతో ఆటో డ్రైవర్ జె.సునీల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 106 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవరపల్లిలో బైకు చోరీ

ప్రజాశక్తి-పర్చూరు

ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకు చోరీకి గురైంది. ఈ ఘటన మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాదెండ్ల వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి తమ ఇంటి ముందు బైకును పార్కింగ్ చేశారు. బుధవారం ఉదయం చూసే సరికి బైకు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పర్చూరు ఎస్ఐ జె. మాల్యాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.


స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినా, పిసిపిఎన్‌డిటి చట్టం అతిక్రమించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పిసిపిఎన్‌డిటి స్టేట్ నోడల్ ఆఫీసర్ మరియు హెల్త్ కమిషన్ ఎడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనీల్ కుమార్ తెలిపారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ ఎంసిహెచ్, పిసిపిఎన్‌డిటి రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మతో కలసి చీరాల పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్లు పిసిపిఎన్‌డిటి అమలు చేయు విధానాన్ని పరిశీలించారు. అనంతరం అనీల్ కుమార్ మాట్లాడుతూ పిసిపిఎసిడిటి చట్టం అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనీల్ కుమార్ తెలిపారు. స్కానింగ్ సెంటర్లకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేయించు కోవాలన్నారు. స్కానింగ్ సెంటర్ నిర్వహకులు తప్పనిసరిగా ఫాంఎఫ్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవ్రైనా నిబంధనలు అత్రికమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాకోబు, డాక్టర్ బ్రహ్మం, డిపిఒ ప్రేమ పావని, వైద్య ఆరోగ్య సిబంది తదితరులు పాల్గొన్నారు.


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- పెద్దదోర్నాల

మహాశివరాత్రి సందర్భంగా దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. పెద్దదోర్నాలలోని మల్లికార్జున్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని ఎస్‌పి బుధవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసు సిబ్బంది, హైవే పెట్రోలింగ్ వాహనాలు, టోయింగ్ వెహికల్స్, మెకానిక్‌లను ఏర్పాటు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రయాణికులకు ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం సంబంధిత అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని, పండుగను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రాన్ని పరిశీలించి భక్తులకు అన్నం వడ్డించారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పి అడ్మిన్ కె.నాగేశ్వరరావు, మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వైపాలెం సిఐ ప్రభాకర్ రావు,మార్కాపురం సిఐ సుబ్బారావు, దోర్నాల ఎస్ఐ మహేష్, రాచర్ల ఎస్ఐ కోటేశ్వరరావు, మార్కాపురం టౌన్ ఎస్ఐ సైదులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేటపాలెం

1997-98 పదవ తరగతి బ్యాచ్‌కి చెందిన కొండపల్లి బాలు ుహేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అందులో భాగంగా బాలు మహేంద్ర కుటుంబానికి ఆయన స్నేహితులు రూ.1,00,000 ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. మృతుడు బాలు మహేంద్ర మండల పరిధిలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997-98 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివాడు. ఆయన స్నేహితులు ఒక్కొక్కరూ రూ.5 వేల వంతున సేకరించి బాలు మహేంద్ర భార్యకు రూ.1,00,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల అశోక్ కుమార్, జ్యోతి, మోషేష్, పింజల సుబ్బారావు , పల్లపోలు నాగార్జున తదితరులు పాల్గొన్నారు


ఆర్థిక సాయం అందజేస్తున్న మృతుడి స్నేహితులు

ఇంకుడు గుంతలు ఏర్పాటు

ప్రజాశక్తి- కొల్లూరు

సొంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పాటికే మండలంలోని కొల్లూరు, పెసర్లంక, ము సలపాడు , క్రాప ,అనంతవరం ,చిలుమూరు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించినట్లు వారు తెలిపారు వృథా పోతున్న నీటిని ఇంకుడు గుంతల్లోకి పంపించడం ద్వారా నీటి సమస్యలు పరిష్కరించవచ్చునని తెలిపారు. వేసవికాలంలో సమస్యలు లేకుండా ఇంకుడు గుంతలు ఉపయోగ పడతాయని తెలిపారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జలమట్టం పెరిగి కొంత మేర నీటి సమస్య రాదని అధికారులు తెలిపారు.


ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తున్న కూలీలు



పతకాలు సాధజంచిన విద్యార్థులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి- చెరుకుపల్లి

భారత రక్ష మంచ్ ఆధ్వర్యంలో స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా స్థాయిలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం లాంటి సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ యువ కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ పోటీలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భారత రక్ష మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. అశోక్ బాబు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఎడుకొండల రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వందన శర్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రేఖా ఫూలేకర్, జిల్లా కర్రసాము ఇన్‌ఛార్జి నాంచరయ్య పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సాధించారు. పొన్నూరు నారాయణ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, ఆరేపల్లి హోలియర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో ఢిల్లీ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందతిన ఒకటో తరగతి విద్యార్థిని క్యాష్వి బంగారు పతకం, రెండో తరగతి విద్యార్థిని శాన్వికా బంగారు పతకం, 6వ తరగతి విద్యార్థిని విద్య బంగారు పతకం, 6వ తరగతి విద్యార్థిని వర్షిత రజత, 8వ తరగతి విద్యార్థి సాయి లహరి రెడ్డి బంగారు పతకం సాధించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ టీచర్ భావన, మ్యూజిక్ టీచర్ సిమంత, ఉపాధ్యాయులు హనుమంత్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల పందేలను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజల ఐక్యతతోనే గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రజలందరూ కలిసి మెలిసి ఐక్యంగా ఉన్నప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య తెలిపారు. శివరాత్రి పండుగ సందర్భంగా చీరాల మండలం బోయినవారిపాలెం గ్రామంలో ఏర్పాటు నిర్వహిస్తున్న ఒంగోలు జాతి పోలు రాధా ఎడ్ల పందేలను ఎమ్మెల్యే కొండయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందేలని తెలిపారు. ప్రజలు ప్రతి ఏడాది ఆనవాయితీగా గ్రామ ప్రజలందరూ ఐక్యతతో ఎడ్ల పోటీలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పండుగ సందర్భాలలో గ్రామస్తులంతా ఒక్కటై మంచి వాతావరణంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవడమే నిజమైన పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో కలిసి మెలిసి పండుగలు నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సాంప్రదాయ పద్ధతిలో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. పండుగల సాంప్రదాయాలను కాపాడాలన్నారు. అన్ని పండుగలను సంతోషంగా నిరవహించుకోవాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి ఎడ్ల పందేలకు హాజరైన వారిని ఎమ్మెల్యే పలకరించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు,. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు తీయాలంటే..

గంటల తరబడి నిరీక్షించాల్సిందే..!

- ఉప్పరపాలెం వద్ద అండర్ పాస్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం
- రాకపోకలకు ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి- బాపట్ల

బాపట్ల ఉప్పరపాలెం మార్గంలోని రైల్వేగేటు తీయాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిందే. విజయవాడ –చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో బాపట్ల పట్టణంలో ఉప్పరపాలెం రైల్వే గేటు రైళ్ల రాకపోకల కోసం ఒక్కసారి గేటు వేస్తే అటు ఇటు వాహన దారులు గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. గంట వరకు గేటు తీసేవరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఈగేటు ద్వారా తిరిగే వాహనదారులు రోజు మొత్తంలో గంటల తరబడి ఇక్కడ వేచి ఉండేందుకే సమయం సరిపోతోంది. పట్టణంలోని ఒకటో వార్డు నుంచి 8 వార్డు వరకూ ప్రజలు ఈ గేటు ద్వారా వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. మూడో రైల్వే లైన్ల నిర్మాణం జరిగాక ఒక్కో సందర్భంలో అటు రెండు, ఇటు రెండు,నాలుగు రైళ్లు వెళ్లే వరకు గంటకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. 2016లో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యులుగా ఉన్న అప్పటి శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ ఇక్కడ రైల్వే గేటు స్థానంలో అండర్ పాస్ నిర్మాణాన్ని అవసరాన్ని గుర్తించారు. రైల్వే లైన్ క్రిందగా వెళ్లిన తవ్వకాలవ వెడల్పుగా పెంచి వాహనాల రాకపోకలకు అనువుగా అండర్ పాస్ తరహాలో తక్కువ ఖర్చుతో నిర్మించవచ్చని అప్పట్లో ఓ ప్రతిపాదన చేశారు. అది కార్యరూపం దాల్చలేదు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ గేటుతో ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను దష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి, స్థానిక అధికారులు ఇక్కడ అండర్ పాస్ ఆవశ్యకతను గుర్తించారు. సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు అండర్ పాస్ నిర్మాణం కోసం వెచ్చించేందు ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి సంబంధించి రైల్వే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పరిశీలన జరిపారు. ఇక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేసే సమయంలో ఒక ఏడాది పాటు ఈ గేటు ద్వారా రాకపోకలు పూర్తిగా నిలిపి వేయాల్సి వస్తుందని, వాహనాలు జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి ,చాకలిపాలెం రైల్వే గేట్ ద్వారా ప్రయాణం చేయాల్సి ఉంటుందని అప్పట్లో అండర్ పాస్‌కు సంబంధించిన ప్రణాళిక రూపొందించి రైల్వే శాఖకు పంపారు. అది కాస్త ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉప్పరపాలెం రైల్వే గేట్ తో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకుల స్పందన కరువైంది. ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణించే ఈ గేటుతో విసిగి వేసారుతున్న ప్రజల సమస్యను తీర్చడంలో కనీసం అధికారులు కానీ ప్రజాప్రతినిధులు గాని కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్కసారి అత్యవసర పరిస్థితుల్లో మూడు చక్రాల రిక్షాపై ఆసుపత్రికి వెళ్లేందుకు ఫ్లై ఓవర్ ఎక్కలేక ఈ గేట్ ద్వారా వెళ్లాలంటే పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఈ గేటు ద్వారా ప్రయాణించే సన్న, చిన్నకారు రైతులు, చేతివత్తుల వారు సైతం జమ్ముల పాలెం ఫ్లైఓవర్ ద్వారా తిరిగి వెళ్లాలంటే అదనంగా ఇంధనం ఖర్చవుతుంది. ఈ గేట్ ద్వారా వెళదామని వస్తే ఇక్కడ గేటు వేసి ఉండడంతో సమయం వథా కావడంతో ఇదేం ఖర్మ అని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. 8 వార్డుల ప్రజలు ఈ గేటు ద్వారా ప్రయాణించాల్సి వస్తోంది. జనాభా పెరుగుతోంది అందుకు అవసరాలకు తగ్గట్టు ఈ మార్గంలో గేటు స్థానంలో అండర్ పాస్ నిర్మించాల్సిన అవసరాన్ని గతంలో గుర్తించారు. నేడు దానిపై కనీసం పట్టించుకోకపోవడం పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్, శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ దష్టి సారించి ఉప్పరపాలెం గేటు స్థానంలో అండర్ పాస్‌ను నిర్మించి ఉప్పరపాలెం రైల్వే గేట్ ద్వారా ప్రతినిత్యం తిరిగే ప్రజల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.



రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

విద్యుత్ బకాయిల వసూలుకు కృషి

ఎస్ఇ గువ్వల ఆంజనేయులు

ప్రజాశక్తి- బాటప్ల

జిల్లాలోని గ్రామ పచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల వసూలుకు కృషి చేస్తానని విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజినీరు గువ్వల ఆంజనేయులు తెలిపారు. బాపట్ల విద్యుత్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా పనిచేస్తున్న ఆంనేయులు ఉద్యోగన్నతిపై ఇక్కడే విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరుగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలోని సుమారు రూ. 100 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. వాటి వసూలుకు కృషి చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. వోల్టేజ్ లేకుండా ముందస్తుగానే అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలోని బాపట్ల, అద్దంకి, చీరాల విద్యుత్ డివిజన్లకు కలిపి నూతనంగా సర్కిల్ ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాకు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడతామన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి ప్రతి రోజు పగటిపుటే విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 24/7 విద్యుత్ సరఫరా పట్టణాలు పల్లెల్లో ఎక్కడ విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తు న్నామన్నారు. సోలార్ విద్యుత్తును వినియోగించుకునే విధంగా ప్రభుత్వం చేపట్టిన పిఎం సూర్య ఘర్ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. నేపథ్యంలో దీనిపై విస్తతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. జిల్లాలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు ఎక్కడ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశం పరిశీలనలో ఉందన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్తు అందించే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆంజనే యులును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

మార్చి నుంచి 'పల్లె పడక'

వైసిపి రేపల్లె కన్వీనర్ డాక్టర్ గణేష్

ప్రజాశక్తి- చెరుకుపల్లి

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు మార్చి నుంచి పల్లె పడక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వైసిపి రేపల్లె నియోజక వర్గ కన్వీనర్ డాక్టర్ గణేష్ అన్నారు. గుల్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గణేష్ బుధవారం మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి శని, ఆదివారాల్లో పల్లెలలో బస చేసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. మొదటిగా చెరుకుపల్లి మండలం నుంచి పల్లె పడక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెం పంచాయతీలోని బాప్టిస్ట్ పాలెంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు గణేష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం వికలాంగులు, అనారోగ్య సమస్యలతో పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుల పెన్షన్లను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు, వివిధ ఆరోగ్య పథకాలను కూటమి ప్రభుత్వం తొలగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు.

మార్చి 12వ తేదీన ఫీజు పోరు.

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు డాక్టర్ గణేష్ తెలిపారు. కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కార దిశగా వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మార్చి12న బాపట్ల జిల్లా కేంద్రంలో ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్



నిమ్జ్ ప్రాంతంలో పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

'నిమ్జ్' పరిశ్రమలు ఏర్పాటు చేయకుంటే..

ఉద్యమాలు తప్పవు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

యువత వలసలు నివారించాలన్నా.. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా.. కేంద్ర ప్రభుత్వం నిమ్జ్ పరిశ్రమలకు నిధులు కేటాయించి ఏర్పాటుచేయాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ హెచ్చరించారు. బుధవారం సిపిఎం బృందం నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలించింది. హనీఫ్ మాట్లాడుతూ 2012లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హయాంలో నిమ్జ్‌ను తెచ్చారన్నారు. ప్రభుత్వ భూమి, ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసిన భూమి మొత్తం 14,230 ఎకరాలు కంపెనీలకు ఇవ్వటం జరిగిందన్నారు. భూములు ఇస్తే కంపెనీలు వస్తాయని, బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంత రైతులు ఎంతో ఆశ పడి.. భూమి ఇస్తే వారికి నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించి పరిశ్రమలు ప్రారంభించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, బడుగు వెంకటేశ్వర్లు, కొండలరావు, షేక్ ఖాదర్‌భాషా, చల్లా వెంకటేశ్వర్లు, కాలేజ్ శంకర్, ఎస్కే అల్లాబక్షు, వీరనారాయణ, బి.నాగేశ్వరరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

ఫాగింగ్ మిషన్లు.. ఉన్నట్టా..లేనట్టా..?

10 కొత్త మిషన్లు కనిపించని వైనం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో అక్రమాలకు కొదవలేదు. తప్పుడు బిల్లులతో ప్రజాధనంలో కొంత భాగం ఎలాగూ మెక్కుతున్నారనేది బహిరంగ రహస్యమే.! ధనార్జనకు అలవాటు పడిన సిబ్బందిలో కొందరి చేతివాటంతో ఏకంగా యంత్రాలు కూడా మాయమవుతున్నాయి.! తాజాగా ఫాగింగ్ మిషన్‌లు రెండు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో పది ఫాగింగ్ మిషన్‌లు ఏమైనట్లు.? ఉన్నట్టా... లేనట్లా అనే చర్చ ప్రస్తుతం నడుస్తోంది.

మార్కాపురం మున్సిపాలిటీలో గతంలో కరోనా వచ్చిన సమయంలో రెండు వార్డు సచివాలయాలకు కలిపి ఒకటి చొప్పున పది ఫాగింగ్ మిషన్‌లను కొనుగోలు చేశారు. వాటితో పాటు పాత మిషన్‌లు మరో రెండు ఉన్నాయి. పట్టణంలో దోమల నివారణ కోసం ఈ యంత్రాలను కొనుగోలు చేయడం జరిగింది. కరోనా సమయంలో ప్రజలను దోమల నుండి కాపాడేందుకు ఫాగింగ్ మిషన్‌లను అవసరమైన మేర కొనుగోలు చేశారు. ఒక్కో దాని విలువ రూ.50 వేలు ఉంటుందని అంచనా. కొనుగోలు చేసిన కొత్తలో ఒకటి, రెండు సార్లు మాత్రమే పట్టణంలో ఫాగింగ్ చేశారు. ఆ తరువాత ఆ మిషన్లు కనిపించలేదు. గతంలో ఉన్న రెండు, మూడు మిషన్‌లు మాత్రమే వినియోగంలో ఉంటున్నాయి. ఫాగింగ్ మిషన్‌లు నిరంతరం వినియోగిస్తున్నట్లు.. దానికి అయ్యే ఖర్చు మాత్రం బారెడన్నట్లుగా రికార్డుల్లో చూపుతున్నారు. కానీ ఫాగింగ్ మొక్కుబడిగా జరుగుతోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సైతం కౌన్సిలర్ల ఫాగింగ్ ఎక్కడ జరుగుతోందని అనేక సార్లు ప్రశ్నించడం జరిగింది. గత కౌన్సిల్‌లో ఫాగింగ్ మిషన్‌లు ఎక్కడున్నాయి... ఏమయ్యాయి.? అని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించగా అధికారుల నుండి సరైన సమాధానం లేదు. మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు మాత్రం ఫాగింగ్ మిషన్‌లపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఎక్కడున్నాయో కూడా చెప్పాలని పట్టుబట్టినా విచారణ పూర్తయిన తరువాత ఎక్కడనేది తేలుతుందని తెలిపారు. కానీ వాటిని అమ్ముకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధికారులు మాత్రం మరమ్మతులకు గురయ్యాయని, గుంటూరులో ఉన్నాయని సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నారు. అసలు ఫాగింగ్ మిషన్‌లు ఉన్నట్టా... లేనట్టా అనేది అంతుబట్టని ప్రశ్న...?



ఫాగింగ్ మిషన్లు

ప్రభుత్వ ఉద్యోగులకు

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కర్ర దేవ సహాయం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పర్రె వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, పిఆర్‌సిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ప్రకటించవలసిన పిఆర్‌సిని ఆలస్యంగా నియమించడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన 25 వేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే చెల్లించాలని నాలుగేళ్ళ క్రితం పెట్టుకున్న సరెండర్ లీవ్ లు ఇంత వరకు జమ కాలేదన్నారు. గత పిఆర్‌సి, డిఏ బకాయిలు నేటికి జమ కాలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల బకాయిలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవోను రద్దు చేస్తామంటూ పాఠశాలను కుదించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడంతో విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందన్నారు. కార్యక్రమంలో బిటిఏ సీనియర్ నాయకులు దేవరాజుగట్టు శివకాశయ్య, జిల్లా నాయకులు గాలిమోటు భాస్కర్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహాశివరాత్రి సందర్భంగా కెస్ఎన్ అండ్ కెవిఎల్ ట్రస్టు తరఫున ఒంగోలులో వంద మందికి బుధవారం నాడు భోజనం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కప్పర ప్రభాకర్, వెలగపూడి సత్యనారాయణ మూర్తి, గౌరవరపు వెంకటేశ్వరరెడ్డి, కొప్పోలు నరేంద్రకుమార్, కప్పర కష్ణసాయి హర్షిత్, కప్పర సాయి సత్యనారాయణ, కప్పర లక్ష్మి పాల్గొన్నారు.



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

'హీల్' విద్యాసంస్థ ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రముఖ 'హీల్ చారిటీ సంస్థ' నిర్వహిస్తున్న విద్యాసంస్థలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా, ఆగిరిపల్లి మండలం, తోటపల్లిలోని విద్యాసంస్థలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి హీల్ పాఠశాల (స్వచ్ఛంద సంస్థ) లో అడ్మిషన్స్ కోసం 1 నుండి 5వ తరగతి వరకు మరియు 11వ తరగతి (ఎంపిసి), బైపిసి, ఎంఇసి కోర్సులకు ప్రవేశానికి అనాథ బాలబాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయి ఆర్థికంగా వెనకబడిన బాలబాలికల నుండి దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా మార్చి 7 లోగా పంపుకోవచ్చని పేర్కొన్నారు. హీల్ విద్యా సంస్థ నిర్వహించే ప్రవేశ పరీక్ష లో ఉత్తీర్ణత సాధించిన వారికి అడ్మిషన్ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9100024438 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా విద్యా శాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి కోరారు. కొమరోలు మండలం ఏబిఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డి.ఆంజనేయులు మూడు నెలల జీతాలు సమస్య, చెరుకూరు ఆంధ్ర కేసరి మెమోరియల్ రెసిడెన్సి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులకు 13 నెలల జీతాల సమస్యను పరిష్కరించాలన్నారు. కోర్టుకు వెళ్లిన 13 ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల రిలీవింగ్, జాయినింగ్ సమస్యను, జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని వారు డిఇఒను కోరారు.

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



మార్కాపురంలో ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శైవ క్షేత్రాలన్నీ జనంతో కిటకిటలాడాయి. ఈ వేడుకల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని శ్రీమార్కెండేశ్వరాలయంలో అన్నా వెంకటరాంబాబు కుటుంబీకులతో వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెంలోని ముణీశ్వర ఆలయ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. అనంతరం తర్లుపాడు మండలంలోని కేతగుడిపి గ్రామంలోని కేదారేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో కందుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

శివాలయాలలో సత్య పూజలు

జరుగుమల్లి: మండలంలోని నరసింగోలు గ్రామంలో ప్రత్యేక లింగరూప శనీశ్వర ఆలయంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సతీసమేతంగా పూజలు నిర్వహించారు. టంగుటూరు గ్రామంలో ప్రసిద్ధి గాంచిన అంగలమ్మ పరమేశ్వరిదేవి దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి.. నగరోత్సవంలో పాల్గొన్నారు. కార్యమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఒంగోలులో జనార్దన్ దంపతుల పూజలు



జరుగుమల్లిలో ప్రత్యేక పూజల్లో దామచర్ల సత్య

ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే దామచర్ల దంపతులు

ఒంగోలు కలెక్టరేట్: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఒంగోలు, సంతపేట సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఆయన సతీమణి నాగసత్యలత పాల్గొన్నారు. ప్రముఖ పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ పరమ శివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కుమార్తె అనీషా లక్ష్మి, టిడిపి నాయకులు మేడికొండ మోహనరావు, బండారు మదన్, పి.వెంకటేశ్వరరెడ్డి, సంతపేట సాయిబాబా మందిరం నిర్వాహకులు అళహరి చెంచలరావు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

దర్శికి చెందిన స్నేహ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ జ్యోతి అంజయ్య తల్లి జ్యోతి అక్కమ్మ 12వ వర్ధంతి సందర్భంగా దర్శి కురిచేడు రోడ్‌లోని సాయిబాబా వృద్ధాశ్రమంలో అన్నదానం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కమ్మ భర్త సుబ్బరాయుడు, కుమారులు, కోడళ్ళు పాల్గొన్నారు.



మహా ప్రాకార నిర్మాణానికి విరాళం చేస్తున్న దాతలు

మహా ప్రాకార నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహాప్రాకార నిర్మాణానికి దర్శి మండలం తిమ్మాయిపాలెం, మోటుపల్లి గ్రామానికి చెందిన గోను లక్ష్మీనారాయణరెడ్డి, పద్మావతి రూ.1,00,116 విరాళం అందజేశారు. దాతలను ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్నఆదినారాయణలు స్వామి శేష వస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలో గురువారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేంలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంబ బాలసంగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో పాలపండ్ల విభాగం నుంచి ఆరుబండ్ల సైజు వరకు (12 క్వింటాల బండ) ఎడ్ల పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.30, రూ.20, రూ.10వేలు అందజేస్తామని తెలిపారు. శివాలయం వద్ద భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8790612406, 9704364204 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చోరీలతో బెంబేలెత్తుతున్న జనం

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని బుడ్డారెడ్డిపల్లెలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. మనుషులు ఎవరూ లేకుండా తాళాలు వేసిన ఇండ్లను గమనించిన దొంగలు విలువైన వంట సామాగ్రిని దొంగలిస్తున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్లలో నగదు, బంగారం వంటి వాటితోపాటు విలువైన వస్తువులను సైతం ఎత్తుకపోతున్నారు. ప్రధానంగా ఇత్తడి, రాగి, కంచు లాంటి వస్తువులను కూడా దొంగలిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి పెద్ద వస్తువులను సైతం ఎత్తుకెళ్లడం గ్రామాల్లో ఆందోళన కలిగిస్తుంది. ఇటీవల కాలంలో బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో బొర్రా కోటమ్మ, అల్లాటపల్లి నాగరత్నమ్మ, పి అంకమ్మ ఇంళ్లలో రూ.లక్ష విలువైన వంట సామాను దొంగలించారు. గ్రామంలో ఇంటి యజమాని లేనప్పుడు గమనించి దొంగలు సామాను తీసుకుపోతు న్నారు. ఇండ్లకు వచ్చిన తర్వాత తాళాలు తీసి చూస్తే ఇంట్లోని వస్తువులను దొంగిలించినట్లు గుర్తించారు. ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తీసి చోరీ చేస్తున్నారు. ఈ విధంగా జరగటం పట్ల గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తజనం



జలపాతం వద్ద స్నానలాచరిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మహాశివరాత్రి పండుగ సందర్భంగా జిల్లాలో ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోన భక్తజన సందోహంతో కిక్కిరిసింది. శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో తెల్లవారు జాము నుండి భైరవకోనకు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భైరవకోనలో జలపాతం భక్తులను ఆకర్షించింది. ముందుగా భక్తులు జలపాతాన్ని వీక్షించి అనంతరం అందులో పుణ్య స్నానాలు ఆచరించారు. తదనంతరం కాలభైరవ స్వామిని, త్రిముఖ దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఒకే రాతిలో మలచబడిన 8 శివలింగాలను దర్శించుకొని అభిషేకాలు చేయించుకున్నారు. భక్తులకు ఆలయ ఇఓ వంశీకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు సౌకర్యాలు కల్పించారు. రెడ్ల సంక్షేమ సంఘం, యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. దాతలు సహకారంతో మజ్జిగ, తాగునీరు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొండ క్రింది భాగం నుండి 15 ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేసి కొండపైకి భక్తులను తరలించారు. భక్తుల సౌకర్యార్థం ఉదయగిరి, కనిగిరి, తదితర డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపారు. పామూరు సిఐ భీమానాయక్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. వాహన పార్కింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. శివరాత్రి సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

మహాశివరాత్రి సందర్భంగా పలువురు ప్రముఖులు భైరవకోనను సందర్శించుకున్నారు. అమ్మవారిని, కాలభైర వస్వామిని, శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చు కున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డి సతీసమేతంగా భైరవకోనను సంద ర్శించుకున్నారు. వైసిపి ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి ఇన్‌చార్జి అన్నా వెంకటరాంబాబు, కందుకూరు వైసిపి ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. పూజారులు వీరికి ప్రత్యేక ఆహ్వానం పలికారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగిశెట్టి చిన్నమాల కొండయ్య, బొబ్బూరి రమేష్, చెరుకుపల్లి వెంకటరెడ్డి, భైరవకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్లు జి వెంకటరామరాజు, ముప్పాళ్ళ వెంకట నరసరాజు, ఏడవ శ్రీనివాసులు, పామూరు మండల అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు గుంటక తిరుపతిరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయంలో పూజలు

మహాశివరాత్రి సందర్భంగా మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణ స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా ఆకర్షనీయంగా అలంకరించారు. ఉదయం నుండి స్వామివారి అభిషేకాలు, హెూమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణస్వామి దేవస్థానం ఇఓ గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణలు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. నారాయణస్వామి కమ్మ అన్నదాన సత్రం, యాదవ, రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



మిట్టపాలెం నారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



భైరవకోనలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



మాట్లాడుతున్న టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని వివిధ శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని శ్రీగంగా సమేత రామలింగేశ్వరస్వామి తిరుణాల సందర్భంగా కూటమి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ శివయ్య అనుగ్రహంతో అందరూ ఆనందంగా ఉండాలని, పంటలు పుష్కలంగా పండి రైతులందరూ బాగుండాలని ఆకాంక్షించారు. అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జనసేన నాయకులు వరికూటి నాగరాజు, మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్యను ప్రసంగించారు. గురువారం శివరాత్రి రోజున దర్శి శివాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పూజ, రుద్రాభిషేకం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ట్రస్ట్ చైర్మన్ నారపుశెట్టి శివప్రసాద్ తెలిపారు. కొర్లమడుగు, పోతకమూరు శివాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామాల నాయకులు పురోహితులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తాళ్ళూరు : మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలోని శ్రీ గంగా పర్వత వర్ధని సోమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ పూజారి నుదురుపాటి వెంకటకృష్ణారావు (రమణయ్య పంతులు), లలితమ్మ దంపతులు రూ.40వేల విలువైన జఠాజూఠమ్ బహుకరించారు. గ్రామానికి చెందిన గంగవరపు సుబ్బారెడ్డి ధర్మపత్ని పద్మ కుమార్తెలు, అల్లుళ్ళు రూ.80వేల విలువైన వెండి కిరీటంతో అలంకరించారు.

కొనకనమిట్ల : మండలంలోని ఎదురాళ్లపాడు, సంగమేశ్వరాలయం, సలనూతల కొండల్లో వెలసిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, అంబాపురంలో బాలత్రిపురసుందరి దేవి, కొనకనమిట్ల శివాలయంను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుండి భక్తులు ఆలయాలను సందర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పా టు చేశారు. అంబాపురంలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజులు పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తలనూతల రామలింగే శ్వరస్వామిని కుంకుంమ బండ్లమీద ఊరేగించారు. సలనూతల రామలింగేశ్వరస్వామిని సర్పంచ్ వి అంజనీ శివకుమారి, అంజయ్య, ఎంపీటీసీ కోంద్రు వెంకటేశ్వర్లు, నాగేశ్వరమ్మ దంపతులు దర్శించుకున్నారు. ఆయా ఆలయాల సన్నిధిలో సాంస్కృతిర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పొదిలి : మహాశివరాత్రి పండుగ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ప్రతిపాదిత దేవస్థానం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్యలు ఆమెకు శివాలయం తరపున పట్టు వస్త్రాలు అందజేశారు.



జడ్జి ప్రత్యూషకు పట్టువస్త్రాలు అందజేస్తున్న అధికారులు



నారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఇఒ

నారాయణరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పొదిలి

మహాశివరాత్రి పండుగ సందర్భంగా స్థానిక శ్రీ పార్వతీ సమేతంగా నిర్మామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత నందిసేవతో ఉమామహేశ్వర అలంకారంతో అలగ్రిత స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుండి ఆలయానికి పోటెత్తారు. ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి దర్శనం కలిగించారు. మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. ఆయనకు ఆలయ అధికారులు, నాయకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇఒ నారాయణరెడ్డి, ప్రతిపాదిత దేవస్థానం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి ఎలమంద, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, మాజీ దేవస్థానం చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గౌస్ బాషా, టిడిపి మండల అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, తాడికొండ వెంకట్రావు, తెలుగు యువత మండల కార్యదర్శి పోపూరి నరేష్, స్వామి రాజా, ముని శ్రీను, దంతలూరు వెంకట్రావు స్వాగతం పలికారు.

శివనామ స్మరణతో...

మార్మోగిన శైవక్షేత్రాలు

ప్రజాశక్తి - రేపల్లె

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలకోటేశ్వరస్వామిని మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాశివుని కరుణా, కటాక్షాలు తెలుగు జాతికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలందరూ మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని అరవపల్లి, కొత్తపాలెం, గోవాడ శివాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కష్ణ పశ్చిమ డేటా ప్రాజెక్ట్ చైర్మన్ పంతాని మురళీధరరావు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కొలసాని రాము, మంత్రి వ్యక్తిగత సహాయకులు వై.ధర్మతేజ, టిడిపి నాయకులు తాతా ఏడుకొండలు, ఆలయ కార్యనిర్వహణ అధికారి అప్పలా చార్యులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు కొమ్మూరు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె : భక్తులకు సేవలందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా పరిటాల యువసేన , స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత సేవలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా సాయం చేయాలని తలంపుతో పరిటాల యువసేన పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినంద నీయమన్నారు. తిరునాళ్లకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత మంచినీరు మజ్జిగ ఉచిత భోజన సదుపాయాలను కనిపిస్తున్న దండమూడి ధరణికుమార్‌ను అభినందించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని, వేద గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, అల్పాహారం కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, పరిటాల యువసేన అధ్యక్షుడు దండమూడి ధరణి కుమార్, కష్ణ,పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాన్ని మురళీధర్‌రావు, టిడిపి నాయకులు తాత ఏడుకొండలు, కొనసాని రాము, ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.


రేపల్లెలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనగాని సత్య ప్రసాద్

చెరుకుపల్లి : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవాడ శ్రీ బాలకోటేశ్వర స్వామి వారి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్లకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలు సేవా సంస్థలు, సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పులిహోర, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. వైసిపి రేపల్లె నియోజక వర్గ కన్వీనర్ డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో గుల్లపల్లిలోని ఈవూరి సుబ్బారావు మెమోరియల్ ఆసుపత్రి ఎదుట అన్నదానం నిర్వహించారు. బాలాజీ థియేటర్ యాజమాని జంపాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. పడితపు బ్రదర్స్, టిడిపి ఆధ్వర్యంలో గోవాడ తాళ్లచెరువు వద్ద, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.


నిజాం పట్నంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

అమర్తలూరు మండలం, గోవాడ తిరునాళ్లను పురస్కరించుకొని పద్మశాలి సేవా సంఘం, బ్రాహ్మణ సేవా సంఘం, ఆర్యవైశ్య సేవా సంఘం, కమ్మ జన సేవా సమితి, గౌడ సంఘం, కుమ్మరి శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రమైన గోవాడలోని శ్రీ బాల కోటేశ్వర స్వామిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఐలాండ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎంఇఒ పి. లాజర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, గౌరవాధక్షుడు ఎం.విజయ్ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి టి.శేషగిరిరావు, ట్రెజరర్ బి.నాగరాజు, ఉపాధ్యక్షుడు వి.రామకష్ణ, కార్యదర్శి వి. నాగరాజు, సభ్యులు ఎన్.పున్నారావు, అశోక్ వర్ధన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు : మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణలో మారుమోగాయి. వేకువ జామునుంచే నుంచి భక్తులు ఆయాలను సందర్శించి ప్రతేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరులోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వభహించారు. ముండ్లమూరు గ్రామానికి చెందిన పులికొండ శ్రీనివాసరావు, నాగలక్ష్మి, మేదరమెట్ల శ్రీనివాసరావు, రమణమ్మ, పులికొండ బ్రహ్మేశ్వరరావు, మౌనిక, పులికొండ వెంకట్రావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి దుర్భాకుల నరేష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఉమామహేశ్వరపురం, మారెళ్ళ, పసుపుగల్లు, పులిపాడు, ఈదర, పోలవరం, పెద్ద రావిపాడు గ్రామాల్లోని శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్చూరు : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని బోడవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోవిందాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. తొలుత స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలతో భక్తుల సమక్షంలో స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు కోడూరు సుబ్రహ్మణ్య చారి, కోడూరు శేష బ్రహ్మచారి, గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని చెరుకూరు అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగయ్య నిర్వహణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాల జరగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ, సిబ్బంది పాల్గొన్నారు.


చెరుకూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పర్చూరు : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని అన్నం బోట్లవారిపాలెం శివాలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కె. సురేష్‌రెడ్డి, దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత న్యాయమూర్తి దంపతులకు ఆలయకమిటీ అధ్యక్షులు ఎన్.నరేంద్రబాబు, కొనకంచి సుబ్బారావు, సభ్యులు ఘన స్వాగతం పలికారు.

నిజాంపట్నం : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. నిజాంపట్నం, గోకర్ణమఠం, కొత్తపాలెం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులకు బారులు తీరారు. వేకువజాము నుంచే భక్తులు శివాలయాల వ తరిలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాలను రంగురంగు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అల్పాహారం, తాగు నీరు అందజేశారు.


సంతమాగులూరులో అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఇఒ రాజేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిజాంపట్నం ఎస్ఐ కె.తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సంతమాగులూరు : మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండల పరిధిలోని పుట్టావారి పాలెం అడ్డరోడ్డు జంక్షన్ వద్ద వెలసియున్న కోటయ్య పాదం రాతి విగ్రహం వద్ద గ్రామ సర్పంచి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ తరపున కోటప్పకొండ వెళ్లే భక్తులకు అన్నదానం నిర్వహించారు. కోటప్పకొండ నుంచి వినుకొండ వెలుతున్న వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జివి. ఆంజనేయులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కొద్దిసేపు జంక్షన్‌లో ఆగి కోటప్ప తొలిపాదం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, సన్నెబోయిన వెంకటేశ్వర్లు, జాజుల పుల్లయ్య, బత్తుల బ్రహ్మయ్య, సింబోతుల వీరయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, తన్నీరు సాయి కష్ణ, ఎస్. వెంకట్రావు పాల్గొన్నారు.

అద్దంకి : మహాశివరాత్రి సందర్భంగా పట్టణ, మరియు గ్రామీణ ప్రాంతాల్లో శివాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివార్లను దర్శంచుకొనేందుకు బారులు తీరారు. చిన్న కాశీగా పేరుగాంచిన మండల పరిధిలోని మణికేశ్వరం గ్రామంలో వెలసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అద్దంకి పట్టణంలోని శ్రీవిద్య వాసవి సమేత శ్రీనగేశ్వర స్వామి వారి దేవస్థానం, రామలింగేశ్వర స్వామివారి దేవస్థానం, శ్రీ కమటేశ్వర స్వామి వారి దేవస్థానాలలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో మణికేశ్వరం గ్రామంలోని శ్రీ గంగా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను, తాగునీరు అందజేశారు.

అమృతలూరు : అమృతలూరు మండలం గోవాడలో నిర్వహించిన మహ శివరాత్రి వేడుకల్లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలియ సంఘీయుల అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులకు భోజనాన్ని వడ్డించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ అశోక్ కుమార్, దేవస్థాన కమిటీ సభ్యులు, టిడిపి నాయకుడు మాచర్ల నాగరాజు పాల్గొన్నారు.


గోవాడలో అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


అద్దంకిలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు


చెరుకుపల్లిలో అన్నదానం చేస్తున్న వైసిపి రేపల్లె నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఈవూరి గణేష్

హెలికాప్టర్‌లో వివాహ వేడుకలకు..





ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలాడు మండలంలోని ఈదుమూడి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆక్వా ఎక్స్‌పోర్టు కూనం వీరభద్రరావు కుమారుడు కోటయ్య చౌదరి వివాహం నిశ్చయమైంది. మార్చి 1న హైదరాబాద్‌లో హైటెక్ సిటీలో వివాహం జరగనుంది. ఐదు రోజుల పాటు వివాహ వేడుకలు జరగనున్నాయి. బుధవారం ఈదుమూడిలో ఎదురు నడిచే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈదుమూడి నుండి హైదరాబాద్ వెళ్లేందుకు హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసుకొని.. పెళ్లి కుమారుడితో పాటు బంధువులు అందులో హైదరాబాద్‌కు పయనమయ్యారు. అక్కడ మూడు రోజుల పాటు వివాహ వేడుకలు జరగనున్నాయి. గ్రామీణ ప్రాంతం నుండి వివాహానికి హెలికాప్టర్ ఏర్పాటు చేయడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



ఉపాస్ హాస్పిటల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

'ఉపాస్'లో ఎన్టీఆర్ వైద్యసేవ ప్రారంభం

- త్వరలోనే అర్హులందరికీ ఆరోగ్య బీమా
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు, సంతపేటలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రెండో బ్రాంచి (హార్ట్ కేర్, పాత రాజమ్మ హాస్పిటల్)లో 'ఎన్టీఆర్ వైద్యసేవ' విభాగాన్ని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్ట్ చైర్మన్ దామచర్ల సత్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ నలుగురు మంచి డాక్టర్లతో ఉపాస్ హాస్పిటల్ ఏర్పాటు చేసి.. ప్రకాశం జిల్లాలోనే వైద్య సేవల్లో మంచి పేరు సంపాదించుకున్నారని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలందించేందుకు 13 విభాగాలలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం శుభ పరిణామమని పేర్కొన్నారు. దీని వల్ల చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాస్ హాస్పిటల్ ద్వారా ఒంగోలు పరిసర ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ల టీమ్ చాలా మంచి టీమ్ అని, జిల్లాలో ప్రముఖ ఆసుపత్రులలో ఒకటైన ఉపాస్ హాస్పిటల్ వారు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా జిల్లా ప్రజలకు మరింతగా సేవలందించాలని సూచించారు. ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ ఇంతవరకు ఉపాస్ హాస్పిటల్ ద్వారా ఇన్సూరెన్స్ ద్వారా సేవలందించామని, బుధవారం నుంచి ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ అనిల్ కుమార్ కాపా, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ చివుకుల, అనస్తీషియా యూనిట్ హెడ్ డాక్టర్ కె పవన్‌కుమార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, యూరాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్, గైనకాలజీ డాక్టర్ రాధా, జనరల్ సర్జన్ డాక్టర్ కె.సువర్ణ రాజు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మలినేని ఇంజనీరింగ్ కాలేజెస్ కరస్పాండెంట్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, ఫ్యూజన్ ఇండియా లిమిటెడ్ హెడ్ సురేష్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్యసేవ విభాగాన్ని ప్రారంభిస్తున్న సత్య

శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల

కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేషన్ శాసనమండలి ఎన్నికలకు బాపట్ల జిల్లాలో సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన గురువారం జరగనున్న కష్ణ, గుంటూరు గ్రాడ్యుయేషన్ నియోజకవర్గం శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. బాపట్ల జిల్లాలోని 34 పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 24,493 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లూ చేశామని ఆయన తెలిపారు.



కలెక్టర్ వెంకటమురళి

పారదర్శకంగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- నిఘానేత్రాల నీడలో పరీక్షలు
- హాజరుకానున్న 42,439 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు నిషిద్ధం
- ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐఒ) ఏ.సైమన్ విక్టర్ తెలిపారు. సిసి కెమెరాలు నిఘాలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల కోసం 67 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 42,439 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన చర్యలను ఆర్ఐఒ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశాం. ఈ పరీక్షలకు మొత్తం 42,439 మంది విద్యార్థులు హాజరు కానుండగా అందులో 21,624 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 20815 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాం. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలు గుర్తించగా వీటిలో కంభం, పెద్ద దోర్నాల, అర్థవీడు, యర్రగొండపాలెం, గిద్దలూరులోని కళాశాలలు ఉన్నాయి. ఈ కేంద్రాలపై ప్రత్యేక దష్టి సారించాం. పరీక్షల నిర్వహణకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్, 67 మంది డిపార్ట్మెంట్ అధికారులు, 1089 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షలలో మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు మూడు ఫ్లైయింగ్, 3 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం. వీరికి తోడు తాను, డిఈసి సభ్యులు, స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్, రెవిన్యూ అధికారులు, రాష్ట్రస్థాయి బోర్డు అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు.



ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్

సులువుగా హాల్ టిక్కెట్లు పొందొచ్చు

హాల్ టిక్కెట్లను ఇంటర్నెట్ కేంద్రాలలో నేరుగా డౌన్‌లోడ్ చేసుకొని, పరీక్షాకేంద్రంలో పరీక్షలకు విద్యార్థులు హాజరు కావచ్చు. హాల్ టికెట్‌లపై విద్యార్థి చదివే కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదు. కొత్తగా ప్రవేశపెట్టిన వాట్సాప్ సర్వీస్ "మన మిత్ర" ద్వారా హాల్‌టికెట్‌లను పొందవచ్చు. ఈ సర్వీసు కోసం వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా "హాయ్" అనే సందేశాన్ని పంపి విద్యార్థి పుట్టిన తేదీ, ఆధార్ నంబర్ సహాయంతో సులభంగా విద్యార్థి హాల్ టికెట్‌ను పొందవచ్చు. విద్యార్థి చదివే కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేకుండానే పరీక్షకు హాజరు కావచ్చు.

సిసి కెమెరాలు అనుసంధానం

ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల పటిష్ట నిఘాలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదులకు, ప్రధాన ప్రవేశ ద్వారం, ప్రశ్నాపత్రాల బండిల్స్ తెరిచే గది జవాబు పత్రాలు ప్యాక్ చేసే రూమ్‌తో సహా మొత్తం సిసి కెమెరాలు బిగించాం. పరీక్షా కేంద్రాల్లో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా చూసేందుకు వీలుగా ఒంగోలులోని ఆర్ఐఒ కార్యాలయానికి, విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సిసి కెమెరాలు అనుసంధానించాం.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

విద్యార్థులు పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష జరుగుతోంది. ఉదయం 8:30 గంటలకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తాం. పరీక్ష 9 గంటలకు ప్రారంభం తర్వాత ఎవరు వచ్చినా అనుమతించం.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషిద్ధం

చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లు, పోలీస్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఇతర స్క్వాడ్ సిబ్బంది సెల్‌ఫోన్లను తీసుకురావాల్సిన అవసరం లేదు. విద్యార్థులు ఎవరూ పరీక్షా కేంద్రానికి స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో కూడిన వస్తువులను పరీక్షా కేంద్రంలోనికి తీసుకురావద్దు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కేంద్రంలో పని చేసే సిబ్బంది ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకురాకూడదు. ఆర్టీసీ సహకారంతో పరీక్షా కేంద్రాలు దూరంగా ఉన్న చోట్లకు బస్సులను నడపటానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. ఒక ఆరోగ్య కార్యకర్త, ఎఎన్ఎంను ఏర్పాటు చేశాం. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాం

విధులలో ఉండే వారికి ఐడి తప్పనిసరి

పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది గుర్తింపు కార్డులు ధరించాలి. పరీక్ష జరిగిన కాలంలో తప్పుడు ప్రచారాలు వ్యాపింపజేసినా, తప్పుడు మార్గాలను అన్వేషించే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08592-281275ను సంప్రదించాలి.